అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇరుకు గదుల్లో నిర్వహణ
- ప్రహరీ లేని ప్రభుత్వ భవనాలు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు


అయిజలో ప్రహరీలేని అంగన్‌వాడీ కేంద్రం

అయిజ: మండలంలో, మున్సిపాలిటీలో కలిపి మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలను నాలుగు భాగాలుగా విభజించి ముగ్గురు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మౌళికవసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. సొంతభవనాలు 29, ఉచిత భవనాలు 19, అద్దె భవనాలు 13 ఉన్నాయి. మండలంలో మొత్తం 8అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంకాపురం, భూంపురం, యాపదిన్నె, ఎక్లాస్‌పురం, చిన్నతాండ్రపాడు, మేడికొండ, బైనిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోవడంతో ఇన్‌చార్జ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. దీంతో నిర్వహణ కష్టసాధ్యమైంది.

ఇరుకుగదులతో ఇబ్బందులు..

మండలంలోని మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 672 మంది, బాలింతలు 509 మంది, 6నెలల నుంచి సంవత్సరం వయసులోపు పిల్లలు 2,832 మంది, మూడు సంవత్సరాల వయసు పైబడిన పిల్లలు 2,451 ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అనుబంధ పోషకాహారం ఇవ్వడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను, ఆరోగ్య పోషణ విద్యను నేర్పించాలి. తప్పని సరిగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారం అందించడానికి సరిపడ గదులు, నీటి వసతి ఉండాలి. పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండాలి. వీటికి విరుద్ధంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ఇరుకు గదులు, తాగునీటి సమస్య, లోపించిన పారిశుధ్యం లాంటి అనేక సమస్యలతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు లేకపోవడం వల్ల కేంద్రాలకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోతోంది.

మౌలిక వసతులు లేవు



అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ లేకపోవడంతో పందులు సంచరిస్తున్నాయి. కాంఫౌండ్ వాల్, మరుగుదొడ్లు, బాత్‌రూంలు కట్టిస్తే బాగుంటది. తాగునీటి సమస్య లేకుండా చేయాలి. చిన్నచిన్న రూంలలో భోజనం చేయడానికి ఇబ్బందిగా ఉంది. అద్దె భవనాలలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించాలి. అన్ని వసతులుంటే అంగన్‌వాడీ కేంద్రానికి ఎక్కువ మంది వస్తుంటారు.

– శకుంతల, చిన్నతాండ్రపాడు

నూతన భవనాలు నిర్మించాలి



నూతనంగా అంగన్‌వాడీ భవనాలు నిర్మించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పాతభవనాలలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అవి వర్షాకాలం తడిసిపోతుంటాయి. సరైన వసతి లేకపోవడంతో చిన్నారులు, మహిళలు ఇబ్బందులకు గురికావల్సి వస్తుంది. అన్ని మౌలికవసతులు కల్పించి నూతన భవనాలు నిర్వస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– జయలక్ష్మి, పర్దీపురం

ఉన్నతాధికారులకు చెబుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దూరంగా ఉండే స్థలాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మించరాదని నిబంధనలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నాం. అంగన్‌వాడీ భవనాలు నిర్మించేందుకు ఖాళీ స్థలాలను ఇవ్వాలి. ఇప్పటి వరకు 5 గ్రామాల్లో మాత్రమే స్థలాలు అప్పగించారు.

– కమలాదేవి, సీడీపీఓ

అభివృద్ధి చూసి ఓటేయండి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


వివిధ పార్టీలకు పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: గద్వాలలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో చేశామని, ఈ అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఆదివారం గద్వాల పట్టణం, ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో గట్టు ఎత్తిపోతలు, గద్వాల మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, 300పడకల జిల్లా ఆస్పత్రి వంటి బృహత్తర పథకాలను సాధించామన్నారు. గతంలో కాంగ్రెస్ పాలన అంటేనే స్కాముల పాలన గుర్తుకొస్తుందని విమర్శించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్‌పార్టీ పరిపాలన చూశామని, గత పదేళ్లుగా అవినీతి అక్రమాలకు తావులేకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏరాష్ట్రంలో అమలు చేయని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. మహిళల భరోసా కోసం ప్రత్యేకంగా సఖీ కేంద్రాలు, షీ టీం బృందాలు ఏర్పాటు చేసి పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఇలాంటి కీలకతరుణంలో అవినీతికి మారుపేరుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలకు మోసపోతే పూర్తిగా నష్టపోతామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను ఈ ఐదేళ్లు వారి వెంటే నడిచానన్నారు. ప్రజలందరూ విచక్షణతో ఆలోచించి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను, గద్వాలలో తనను గెలిపించాలని కోరారు.

పట్టణాన్ని మరింత అభివృద్ధి..

సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని, గద్వాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, పట్టణ భవిష్యత్ ప్రజల చేతిలోనే ఉందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గద్వాల పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని, మరింత అభివృద్ధి జరగాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. ఆయన ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే గద్వాల పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్, దొలు పాల్గొన్నారు.


గద్వాల పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్


బిజ్వారంలో కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

సేవాలాల్, జగదాంబ విగ్రహాల ప్రతిష్ఠ



కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలతండాలోని నూతన సేవాలాల్, జగదాంబ విగ్రహ పతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ఉమిత్యాల బస్టాండ్ నుంచి తండా వరకు విగ్రహాన్ని భారీ ర్యాలీగా తీసుకెళ్లి ఆలయంలో పూజలు చేసి ప్రతిష్టించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో సీఐ ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.ఎస్ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి సీఐకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏకశిలపై అనంత నయనస్వామి, లక్ష్మీదేవి, వరహస్వామి, ఆంజనేయస్వాములు ఆవిర్భవించడం పట్ల సీఐ విశిష్టత గల ప్రాంతంగా పేర్కొన్నారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, శ్రావణ్‌కుమార్‌గౌడు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని పెద్దపల్లి–కుర్వపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన బీటీ రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, గద్వాల ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగిస్తుంది. రాత్రి వేళలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డి, రాజు, తిమ్మప్పలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు


భవానీ ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు

గట్టు: మండల కేంద్రంలోని భవానీమాత దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసహస్రార్జున మహారాజ్ జయంతి మహోత్సవం సందర్భంగా ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసహస్రార్జున మహారాజ్ చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు కేపీ అంబుసా, సంఘం సభ్యులు ఈరన్న, లక్ష్మణ్, చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, తిమ్మప్ప, సురేష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా ఓటరు స్లిప్పుల పంపిణీ


బుర్దపేటలో ఓటరు స్లిప్పులను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేందర్

గద్వాల అర్బన్: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఓలు ఇంటింటికి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఆదివారం గద్వాల మండలంలోని మదనపల్లి, గోనేపాడు గ్రామాల్లో, పట్టణంలోని బుర్దపేట కాలనీలో ఓటరు స్లిప్పుల పంపిణీని తహసీల్దార్ నరేందర్ పర్యవేక్షించారు. ఓటరు స్లిప్పులు అందాయా అని పలుమారు ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మన్నాపురంలో ఊర జాతర


మన్నాపురం జాతరలో భక్తులు

ధరూరు: మండలంలోని మన్నాపురంలో ఊర జాతర ఘనంగా నిర్వహించారు. గుర్రోనిపల్లి లక్ష్మమ్మ జాతర మరుసటి రోజు అక్కడి అంగళ్లన్నీ మన్నాపురంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరాయి. ప్రతి ఏటా గ్రామ పరిధిలో జాతరను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో మహిళలు, పిల్లలు వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని కట్టవీధిలో శ్యామ్, రామ్ స్వాముల ఇంట్లో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాల ధరించిన అన్నదమ్ములు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్ష చేపట్టి పడిపూజను నిర్వహించారు. గణపతి, కుమరస్వామి, అయ్యప్ప స్వామి చిత్ర పటాలకు అర్చనలు నిర్వహించారు. గురుస్వాములు లక్ష్మీనారాయణ, రఘుస్వాముల ఆధ్వర్యంలో పెటతుల్లి, అయ్యప్పస్వామి హారతులు ఘ నంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు ఎల్లయ్య, శ్రీహరి, శశిధర్, దినేష్, మధు, విజయ్, కృష్ణ, శ్రీనివాసులు, రంగ స్వాములు పూజలో పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్ల ర్యాండమైజేషన్ పూర్తి

వనపర్తి: ఈవీఎం, వీవీ ప్యాట్ల రెండోవిడత ర్యాండమైజేషన్ విజయవంతంగా పూర్తి చేసినట్లు నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు సోమేష్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ తెలి పారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానంతో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలకు 370 కంట్రోల్ యూనిట్లు, 370 బ్యాలెట్ యూనిట్లు, 414 వీవీ పాట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతిరావు, నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: అకారణంగా దాడి చేసిన వారిపై కేసు నమోదైన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. మండలంలోని పెద్దదిన్నె గ్రామానికి చెందిన రంగస్వామి, సోదరుడు రమేష్, తల్లి గోవిందమ్మలపై ఇంటి నల్లా విషయంలో అదే గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ ఆదివారం ఉదయం గొడవపడి తన బంధువులతో కలిసి కర్రలతో దాడి చేయగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుని తండ్రి చిన్న మునెప్ప ఫిర్యాదు మేరకు బోయ రమేష్‌తో పాటు వారి బంధువులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైకు

గోపాల్‌పేట: డీసీఎం వాహనాన్ని బైకు వెనక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన మండల కేంద్రానికి సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన డీసీఎం పెళ్లి కోసం మిర్యాలగూడకు గోపాల్‌పేట మీదుగా వెళ్తోంది. అదే సమయంలో బుద్దారం గ్రామానికి చెందిన మహేందర్ తన స్నేహితుడితో కలిసి వనపర్తి నుంచి బుద్దారం గ్రామానికి బైకుపై వెళ్తున్నాడు. పోలికెపాడు అడ్డ రోడ్డు వద్ద డీసీఎంను బైకు వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరు గాయాలపాలయ్యారు. చుట్టుపక్కల వారు గమనించి వారిని వనపర్తి అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.

బొడ్రాయి ప్రతిష్ఠ

మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్‌వనజమ్మ ఆంజనేయులు దంపతులు హోమంలో కూర్చొని పూజలు చేశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

- గద్వాల జిల్లా కేంద్రంలోని 17,18, 6,4,5వ వార్డుల్లో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తానని తెలిపారు.
- తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, మరోమారు అవకాశం కల్పించాలని ఎంపీపీ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మల్దకల్ మండలం బిజ్వారంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- అన్ని వర్గాల ప్రజలకు పారదర్శక పాలనను సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరు బలపరచాలని మండల అధ్యక్షుడు ఉరుకుందు అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని ప్రచారం నిర్వహించారు.
- బీఆర్‌ఎస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని, కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అంగడి బస్వరాజు ఓటర్లకు విజ్ఞప్తి చేశా రు. గట్టు మండలంలోని పెంచికలపాడు, ఆరగిద్దలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- ఉండవెల్లి మండలంలోని ఇటిక్యాలపాడు, తక్కశిల గ్రామాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సాయంత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి ప్రచారం నిర్వహించారు.
- అలంపూర్ నియజకవర్గంలోని 7 మండలాల్లోని 124 గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మానవపాడు మండలంలోని అమరవాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- తెలంగాణలో దొరల పాలనతో అణిచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి అతికుర్ రహమాన్ అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని నందిన్నె గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.
- ఎర్రవల్లి మండలంలోని షేకుపల్లి, సాసనూలు, దువాసిపల్లి, గార్లపాడు, ధర్మవరం గ్రామాల్లో బీఎస్పీ పార్టీల శ్రేణులు గడప గడపకు తిరిగి పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు.

సమస్యల పరిష్కారం గాలికే..

- ప్రజల భాగస్వామ్యం లేని గ్రామసభలు
- నామమాత్రంగా పంచాయతీలో సభలు
- అవగాహన కల్పించని అధికారులు


పల్లెపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు.(ఫైల్)

మానవపాడు: ప్రజా సమస్యలు గ్రామసభలో చర్చించి, వాటి పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. కాని పేరుకే గ్రామసభలు నిర్వహించి సంతకాలు పెట్టించుకోని తూ తూ మంత్రంగా చేతులు దులుపేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొన్ని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల నమోదు వివరాలను గ్రామసభల ద్వారా నిర్వహిస్తుంటారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలను ఈ సభల ద్వారానే తెలుసుకుంటారు. ఇంతటి ప్రాధాన్యత గల గ్రామసభలు మండలంలో నామమాత్రంగా సాగుతున్నాయి.

గ్రామసభల నిర్వహణ తీరు..

గ్రామపంచాయతీల్లో సభ నిర్వహించే తేదీని ఒక రోజు ముందుగానే తెలియజేయాలి. పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. రెండు నెలలకోసారి, సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారులు పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాలి. కనీసం 50 మందితో గ్రామసభను నిర్వహించవచ్చు. సరిపడ మంది రాకుంటే సభను వాయిదా వేయవచ్చు. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలను నమోదు చేసుకోని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి.

గ్రామసభలకు దూరంగా ప్రజలు..

మండలంలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది మంది కూడా రావడం లేదు. ప్రజాప్రతినిధులు, మాజీలు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు, నాయకులకు మధ్య సమాచారం ఉండటం లేదు. గ్రామసభలో చర్చిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపితే గ్రామసభలకు ఆదారణ పెరుగుతుంది.

స్థానిక సమస్యలపై దృష్టి లేదు..



స్థానిక సమస్యలపై పాలకులు, అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఈ సమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కరిస్తే బాగుంటుంది. ప్రతి గ్రామసభలో సమస్యలు చర్చించి పరిష్కరించాలి.

– బోయ నాగేష్, మానవపాడు

సంతకాలు పూర్తి అయితే చాలు..



గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు వార్డునెంబర్లు, అధికారులు వెళ్లి సంతకాలు పూర్తి అయితే చాలు ఇక వెళ్దామా? అన్నట్లు ఉంటుంది గ్రామ సభల నిర్వాహణ. గ్రామస్థాయిలో సభలో సమస్యలు చర్చించి వాటికి పరిష్కారం మార్గం చూపాలి. పేరుకు మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

– సంజీవ నాయుడు, చెన్నిపాడు

ప్రజల భాగస్వామ్యం పెరగాలి

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వాహణపై కార్యదర్శులు టాంటాం(దండోరా) వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. ఈ గ్రామసభల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోని పరిష్కరించేందుకు వీలుంటుంది.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

బైండోవర్ చేయడం సరికాదు

శాంతినగర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయమై సీఎం కేసీఆర్‌ను అడగడానికి వెళ్తామని, తాము వెళ్లకుండా అక్రమంగా బైండోవర్ చేయడం సరియైందికాదని వాల్మీకి సంఘం నాయకులు పైపాడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం శాంతినగర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో సీఎంను ప్రశ్నిస్తారనే కారణంతో వాల్మీకి నాయకులను ముందస్తుగా బైండోవర్ చేయడం బాధాకరమన్నారు. అక్రమ బైండోవర్లతో బోయల ఉద్యమాన్ని ఆపలేరని ఆయన తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



ధరూరు: ఎన్నికల్లో భాగంగా ఎక్సైజ్ పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలో మద్యం తరలిస్తూ వ్యక్తి పట్టుబడ్డాడు. ఆదివారం రాత్రి మండలంలోని ఆయా గ్రామాల్లో తనిఖీలు చేయగా, గుడ్డెందొడ్డికి చెందిన వ్యక్తి బైక్‌పై మద్యం తరలిస్తూ ఆబ్కారీ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తరలిస్తే ఎవరినైనా చట్టరిత్య చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌ఓ గోపాల్ తెలిపారు.